జగన్‌ది రాక్షస పాలన

● ఎమ్మెల్సీ బీటీ నాయుడు

కడప మారుతీనగర్, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జగన్‌రెడ్డి హయాంలో రాక్షస పాలన సాగిందని ప్రస్తుతం రామరాజ్యం వైపుగా ఆంధ్రప్రదేశ్ వడివడిగా పరుగులు పెడుతోందని టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు పేర్కొన్నారు. సోమవారం కడపలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ హాయంలో మాట్లాడే హక్కు, ప్రశ్నించే హక్కు లేకుండా కేసులు బనాయించారన్నారు. పరిశ్రమలు రాష్ట్రం నుంచి తరలిపోయాయన్నారు. దీంతో ప్రజలు విసుగెత్తి ఆకాశంలో విహరిస్తున్న జగన్‌రెడ్డిని గత ఎన్నికల్లో పాతాళానికి తొక్కేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి జై కొట్టారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పారిశ్రామికంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అనువుగా దేశ, విదేశాల పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి దాదాపు 13.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు గాను 613 ఎంవోయూలకు శ్రీకారం చుట్టారన్నారు. దీంతో రానున్న రెండు సంవత్సరాలలో రాయలసీమతో పాటు రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలు అభివృద్ధి పథంలో దూసుకెళతాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ప్రజలు టీడీపీని గెలిపించి బాసటగా నిలవాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కడపపై చంద్రబాబు ఫోకస్

● 18 నెలల్లో నాలుగోసారి జిల్లాకు
● రేపు పెండ్లిమర్రిలో అన్నదాత సుఖీభవకు సీఎం హాజరు



సీఎం ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర లోపే మూడుసార్లు జిల్లాకు రాగా.. ప్రస్తుతం నాలుగోసారి జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు బుధవారం కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి మండలంలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలను కూటమి గెలుచుకుంది. జగన్ సొంత జిల్లాలో ఇంత భారీ స్థాయిలో గెలవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ నేపథ్యంలో పార్టీకి పూర్వవైభవం కోసం కడప జిల్లాపై చంద్రబాబునాయుడు పూర్తి ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ఈ ఏడాది తొలినాళ్లలో సీఎం చంద్రబాబు మైదుకూరులో పర్యటించారు. టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా భావించే మహానాడును కడపలో నిర్వహించారు. ప్రతి నెలా జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జమ్మలమడుగులో పాల్గొన్నారు. ఇప్పుడు అన్నదాత సుఖీభవలో భాగంగా పెండ్లిమర్రికి వస్తున్నారు. 18 నెలల్లో సీఎం చంద్రబాబు నాలుగుసార్లు వచ్చారు. ఇక మంత్రి నారాలోకేశ్ మహానాడుతో పాటు సెప్టెంబరులో కొప్పర్తిలో పరిశ్రమలు, పెండ్లిమర్రిలో కాలేజీలను ప్రారంభించారు. ఇప్పుడు చంద్రబాబునాయుడు పెండ్లిమర్రిలో పర్యటించనున్నారు. తండ్రికొడుకులు ఇద్దరూ కమలాపురం నియోజకవర్గంలోనే ఎక్కువగా పాల్గొంటున్నారు. అంటే చంద్రబాబు, లేదా లోకేశ్ ప్రోగ్రాంను తక్కువ టైంలో చెప్పినా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి విజయవంతం చేస్తారనే నమ్మకంతో ఇక్కడే పెడుతున్నారని చెబుతున్నారు.

సమీక్ష.. పరిశీలన

సీఎం చంద్రబాబునాయుడు బుధవారం పెండ్లిమర్రికి రానుండడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాలను కలెక్టర్ పరిశీలించారు. సాయంత్రం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, జేసీ అదితిసింగ్, ఏఎస్పీ ప్రకాశ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ రెండవ విడత నగదు రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి పెండ్లి మర్రి మండలంలో పాల్గొననున్నారని తెలిపారు. పర్యటన సమయంలో ఎలాంటి లోటు పాట్లు ఉండకుండా ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీఎంవో భద్రత అధికారి కృష్ణారావు, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్, జిల్లా అధికారుల ఆదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా..



సీఎం చంద్రబాబునాయుడు బుధవారం కడప విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పెండ్లిమర్రి మండలం చేరుకుంటారు. వెల్లటూరులోని గ్రోమోర్ కార్యాలయంలో రైతులు, వ్యాపారులతో ముఖాముఖిలో పాల్గొంటారు. అనంతరం భైవరగుట్ట వద్దకు చేరుకుని రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక్కడి నుంచే ప్రధానమంత్రి మోదీ ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో రైతులతో కలసి వీక్షించనున్నారు. తర్వాత చిన్నదారసరిపల్లెలో రైతులతో కలసి పంటలను పరిశీలిస్తారు. ఇక్కడ రైతులు, మహిళలు, కూలీలు, యువకులతో మాట్లాడతారు. పెండ్లిమర్రిలో టీడీపీ కార్యకర్తలతో మాట్లాడతారు.

సీఎం పర్యటన కోసం స్థల పరిశీలన



సీఎం పర్యటనకోసం చెర్లోపల్లె వద్ద పొలాలను పరిశీలించి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పెండ్లిమర్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్ల నిమిత్తం సోమవారం పెండ్లిమర్రి మండలంలోని పలు ప్రాంతాలను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేశ్ విశ్వనాథ్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పరిశీలించారు. 19వ తేదీ బుధవారం చంద్రబాబునాయుడు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిమొత్తాన్ని రైతులకు పంపిణీచేసి, రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. దీనికోసం మండలకేంద్రమైన పెండ్లిమర్రిలో ఒకప్రదేశాన్ని, చిన్నదాసరిపల్లె పంట పొలాలు, వెల్లటూరులోని మానస ఫెర్టిలైజర్, సీడ్స్ సెంటరును, హెలిపాడ్ ఏర్పాటుకు వెల్లటూరులోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, సీఎంఓ భద్రతాధికారి కృష్ణారావు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, ఉద్యానశాఖ జిల్లా అధికారి సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు నిర్లక్ష్యం చేయొద్దు

● జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సమర్పించే ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాలులోని సభాభవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాధితుల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులు పదే పదే కార్యాలయాలకు తిరగకుండా పారదర్శకంగా, నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ వెంకటపతి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, భూగర్భ గనుల శాఖ డీడీ మురళీధర్, పర్యాటక శాఖ అధికారి సురేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేయండి : ఏఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికకు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల ఫిర్యాదులను ఏఎస్పీ స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఆయన ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేసి మాట్లాడారు. సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

ఐక్యతతో కార్పొరేషన్ గెలిచితీరాలి

● టీడీపీ నగర నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో నేతలు



టీడీపీ నగర కమిటీ అధ్యక్షుడిగా మన్సూర్ అలీఖాన్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు తదితరులు

కడప మారుతీనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కడప కార్పొరేషన్‌ను గెలుచుకోవాలని టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు సూచించారు. తెలుగుదేశం పార్టీ నగర నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశీలకుడుగా ఎమ్మెల్సీ హాజరై తొలుత కార్యకర్తలు, నాయకులను ద్దేశించి మాట్లాడారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన వారికి తప్పక పదవులు దక్కుతాయన్నారు. పదవులు దక్కలేదనే నెపంతో పార్టీకి చెడ్డపేరు తీసుకురావద్దన్నారు. పదవులు ఇవ్వలేదని అలిగిపోయిన నాయకుల కోసం టీడీపీ వేచి చూడదన్నారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ.. సీనియర్ నాయకులమంటూ పనిచేయకుండా పదవుల కోసం పాకులాడినా అందవని అన్నారు. పార్టీని దొంగదెబ్బ తీయాలనుకునే నాయకుల చరిత్ర తమ దగ్గరుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలోకి కొత్త తరాన్ని తీసుకువస్తున్నామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. చిల్లర బ్యాచ్‌కు భయపడమన్నారు. కడప నగరాన్ని అభివృద్ధి చేయడమే తమధ్యేయమన్నారు. పార్టీ వలన బాగుపడిన కొంతమంది ఇవాళ కుట్రలకు దిగుతున్నారని అలాంటి వారిని ఏకంగా బుగ్గవంక నీటిలో కలిపేస్తామన్నారు.

అనంతరం నగర నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కడప నగర కమిటీ అధ్యక్షుడిగా లయన్ మన్సూర్ అలీ ఖాన్, ప్రధానకార్యదర్శిగా ఎం.సుబ్బారెడ్డి, వైస్‌ప్రసిడెంట్‌గా పి.గౌతమ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.వెంకటేశు, జి.బాబా ఫకృద్దీన్, పూర్ణచంద్రరావు, సెక్రటరీలుగా కె.వెంకటేశ్ ఆచారి, జి. శ్రీనివాసులు, జి.నరేశ్, ట్రెజరర్‌గా మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నేత జిలానీబాష, కడప మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉస్మాన్, మహిళా అధ్యక్షురాలు పార్వతి, లేబర్ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్.చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందీగా పూర్తిచేయాలి

కడప కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌ను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ప్రత్యేక సమగ్ర సవరణ-2026 పొలిటికల్ పార్టీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఈఆర్వోలు, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా ప్రతిపాదించిన కేంద్రాలను రాజకీయపార్టీలతో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పునః పరిశీలన అనంతరం ఎన్నికల కమిషన్‌కు నివేదికను పంపిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1963 పోలింగ్ కేంద్రాలుండగా, కొత్తగా 158 కేంద్రాలకు ప్రతిపాదనలు అందాయన్నారు. రేషనైజేషన్ తరువాత జిల్లాలో మొత్తం 2121 పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయన్నారు.

గోపవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండల పరిధిలోని హైవే వద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారికి సోమవారం భక్తులు పెద్ద ఎత్తున బోనాలు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పెద్దగోపవరం, చిన్నగోపవరం, రంగసముద్రం, భూమిరెడ్డిపల్లె తదితర గ్రామాల ప్రజలు బోనాలతో స్వామివారి ప్రాంగణానికి చేరుకున్నారు. సంప్రదాయంగా పొంగలి పెట్టి స్వామివారికి సమర్పించిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా ఎడ్లబండ్ల పోటీలు, బండలాగుడు వంటి గ్రామీణ క్రీడలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జయరామిరెడ్డి, సొసైటీ చైర్మన్ రామానాయుడు, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, కవిలి చిన్నసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారికి బోనాలు తీసుకు వెళుతున్న భక్తులు

రోడ్డునూ మింగేశారు

● ఆక్రమించి కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం
● స్థలం విలువ రూ.7 కోట్లు పైమాటే
● పట్టించుకోని అధికార యంత్రాంగం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడప నగరం నలుమూలలా విస్తరిస్తోంది. ప్రధాన సిటీలకు దీటుగా కడప రూపురేఖలు మారిపోతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు అందుబాటులోకి వచ్చాయి. జనం కూడా విలాసవంతమైన, ప్రశాంతమైన ఇండివిడ్యువల్ ఇళ్ల పట్ల మొగ్గు చూపుతున్నారు. కడప నగరంలో బుద్ధ టౌన్‌షిప్ గేటెడ్ కమ్యూనిటెడ్ వెంచర్ ఏర్పాటు చేశారు. అయితే దీనిపై పెద్ద వివాదాలే రేగాయి. వెంచర్ పేరుతో శ్మశానం, చెరువు ఆక్రమించేశారని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఒక విధంగా చెప్పాలంటే వివాదాలకు కేరాఫ్ అయింది. అయితే అన్నీ సద్దు మణుగుతుండగా ఇప్పుడు సుమారు రూ.7 కోట్ల విలువ చేసే రహదారి ఆక్రమణకు గురికావడం, అందులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం పెద్ద దుమారమే రేపుతోంది.



ఆక్రమణకు గురైన రోడ్డు



రోడ్డు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్


రూ.7 కోట్ల పైమాటే

కడప నగరంలో బుద్ధ టౌన్‌షిప్‌ను సుమారు 16 ఎకరాలలో ఏర్పాటు చేశారు. రియల్టర్లు పది సెంట్ల చొప్పున ప్లాట్లను విక్రయించారు. ఇది పెద్ద గేటెడ్ కమ్యూనిటీగా మారింది. వివిధ సర్వేనెంబర్లలో ఈ టౌన్‌షిప్ ఉంది. పుట్లంపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 35/2లో 36 సెంట్ల రస్తాస్థలం ఉంది. బుద్ధ టౌన్‌షిప్ అంటేనే కడపలో ఖరీదైన ప్రాంతం. ఇక్కడ సెంటు స్థలం రూ.22 లక్షల నుంచి రూ.25లక్షల వరకు పలుకుతుంది. అదేస్థాయిలో విక్రయాలు సాగాయి. రిచ్ ఏరియాగా మారింది. ఇలాంటిచోట ఖాళీగా ఉన్న రహదారి స్థలంపై కన్నేశారు. సర్వే నెంబర్ 35/2లో 36 సెంట్లు రహదారి స్థలం అని రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉంది. సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన వారికి ఇది రోడ్డు స్థలమే అని కడప రెవెన్యూ అధికారులు సమాధానం ఇచ్చారు. అయితే ఇది ఇప్పుడు ఆక్రమణకు గురైంది. రోడ్డును ఆక్రమించి ప్రహరీగోడ కట్టి ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ కూడా కట్టేశారు. అక్కడున్న రేటు ప్రకారం 36 సెంట్ల రోడ్డు స్థలం రూ.7 కోట్ల పైమాటే ఉంటుంది. రోడ్డుకు కాస్త స్థలం వదిలేసి మిగతాదంతా సొంత స్థలంగా భావించి ఆక్రమించారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

రెవెన్యూ సహకారం

ఇక్కడ అక్రమాలకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారన్న ప్రచారం ఉంది. అది రస్తా భూమి అని వారి రికార్డులు చెప్పినా పట్టించుకోకపోవడం గమనార్హం. సుమారు రూ.7 కోట్లకు పైగా విలువ చేసే స్థలాన్ని కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

వైభవం కార్తీక దీపోత్సవం



ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయేశ్వర స్వామి



నాగనాథేశ్వరుని ఆలయం గోడపై వెలుగుతున్న దీపం





భక్తులతో కిటకిట లాడుతున్న కడపలోని మృత్యుంజయకుంట శివాలయం

కడప కల్చరల్ / ఖాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివయ్య ఆలయాలకు చేరుకుని అత్యంత భక్తితో కార్తీక దీపాలు వెలిగించారు. ఆ క్రమంలో నగర మృత్యుంజయ కుంటలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయం, మోచంపేట ప్రసన్న విశ్వేశ్వర కామాక్షి ఆలయం, అన్నపూర్ణ ఆలయం, నబీకోట శివాలయం, గడ్డిబజార్‌లోని సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడికి అభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాలలో అఖండ దీపాలు వెలిగించి ప్రత్యేకపూజలు చేశారు. ఖాజీపేటలోని నాగనాథేశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే మెట్ల మార్గంలో మంచును సైతం లెక్కచేయకుండా ఓం నమఃశివాయ అంటూ కొండపైకి ఎక్కి స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొండ కింది భాగంలో భక్తులకు ఆర్యవైశ్యులు, భక్తులు భారీగా అన్నదానం నిర్వహించారు. మూడు వారాలుగా ఆలయ కమిటీ చైర్మన్ గంగవరం సుమన్‌రెడ్డి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం 20 జతల ఎద్దులు పాల్గొనగా గెలుపొందిన వృషభరాజాలకు నగదు బహుమతిని అందజేశారు. సీఐ వంశీధర్ ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



మోచంపేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చిలగడ దుంప.. లాభాల గంప...

● తక్కువ ఖర్చు.. మంచి ఆదాయం

● సేంద్రియ ఎరువులు, డ్రిప్ పద్ధతిలో సాగు



కలకడ మండలంలో చిలగడ దుంపల పంట సాగు, చిలగడ దుంపలు

కలకడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్-రబీ మధ్యస్థ సీజన్‌లో పండించే చిలగడ దుంపలు (గెన్సీ గడ్డల) సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కరువు ప్రాంతంలోని మెట్టభూములు, నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఫలితం అందుకుంటున్నారు. మండలంలోని సింగనొద్దుపల్లె, గుడిబండ, తెట్టు, తిప్పిగారిపల్లె, మండ్యెంవారిపల్లె గ్రామాల రైతులు ఏటా దాదాపు 200 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు.

అదేవిధంగా గుర్రంకొండ, కలికిరి, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో కూడా పంట సాగు చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. రైతు విత్తన తీగలను ముందుగానే సిద్ధం చేసుకుని సాగుకు వాడుతున్నారు. దుక్కుల నుంచి సేంద్రియ ఎరువులు, కూలీలు పంట నూర్పిడికి ఎకరాకు సుమారు రూ.45 వేలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే ఉన్న నీటి వనరుల పొదుపు కోసం డ్రిప్ పద్ధతితో తడులు సమకూరుస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, గత ఏడాది వీటి ధర టన్ను రూ.20 వేల నుంచి 25 వేల వరకు ధర పలికినట్లు తెలిపారు. ఈ వంతున పంట పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకు సుమారు రూ.70 వేలు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ఈ పంటకు తెగుళ్ల తాకిడి లేకపోవడం తమకు కలిసొస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట నుంచి అందిన తీగలు పాడిఆవుల కడుపు నింపడానికి పనికొస్తోందని ధీమాగా ఉన్నారు.

నికర ఆదాయం...



మాకు గెన్సీ గడ్డల సాగులో నికర ఆదాయం వస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఈ సేద్యం చేస్తున్నాం. పంట సాగుకు పెట్టిన పెట్టుబడికి ఎటువంటి ఢోకా ఉండదు. ఈ పంట వేసి నష్టపోయిన దాఖలాలు లేవు.

- బి.మహేశ్వరరెడ్డి, సింగనొద్దుపల్లి, కలకడ మండలం

ఎకరా భూమిలో సాగు చేశా...



ఎకరం భూమిలో సాగు చేశా

ఈ ఏడాది ఎకరం భూమిలో గెన్సీ గడ్డల పంట సాగు చేశా. మాది కరువు ప్రాంతం ఇతర పంటలు సాగు చేస్తే ఫలితం వస్తుందని గ్యారెంటీ లేదు. అందుకు తక్కువ ఖర్చుతో సాగై పంటలపై దృష్టి సాధించాం. ఇందుకు తక్కువ పెట్టుబడి పంటగా గెన్సీ గడ్డల పంటను సాగు చేస్తున్నాం. ఏటా సాగులో లాభాలను గడిస్తున్నాం.

- ఆర్.వీరాంజులు, తెట్టు గ్రామం, కలకడ, మండలం

మార్కెటింగ్ అవకాశాలు...

రైతులు పండించిన సరుకును వ్యాపారులు పొలం వద్దే కొనుగోలు చేస్తారు. మొదటి విడతగా జనవరిలో వచ్చే సరుకును వారు కొనుగోలు చేసి చెన్నై, హైదరాబాదు, విజయవాడ తదితర మార్కెట్‌లకు తరలిస్తారు. అదేవిధంగా రెండో విడతగా మార్చి, ఫిబ్రవరిలో వచ్చే సరుకును ఢిల్లీ, కోల్‌కతా, తదితర ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు, ఉత్తరాది రాష్ట్రాల్లో మహాశివరాత్రి పర్వదినం రోజు దేవుడికి నైవేద్య సమర్పణకు, వంటకాలకు గెన్సీ గడ్డలను విరివిగా ఉపయోగిస్తారు. అందువల్ల ఆ సమయంలో వీటికి గిరాకీ ఎక్కువగా ఉంటుందని మార్కెట్‌లో సరుకు బాగా అమ్ముడుపోతుందని వ్యాపారులు తెలిపారు. ఈ పంట వేసిన రైతు ఇంతవరకు నష్టపోయిన దాఖలాలు లేవని చెబుతున్నారు.

పరిశ్రమలు వస్తేనే కోడూరు అభివృద్ధి

టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్



మాట్లాడుతున్న పంతగాని

రైల్వేకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు వస్తేనే కోడూరు అభివృద్ధి సాధ్యం అవుతుందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ విశాఖలో సీఐఐ నిర్వహించిన సదస్సులో పెట్టుబడులు రాష్ట్రానికి వరదలా వచ్చాయని తెలిపారు. రైల్వేకోడూరుకు వ్యవసాయ అధారిత పరిశ్రమలను తీసుకుని రావాలని కోరారు. రైల్వేకోడూరులో బొప్పాయి, అరటి, మామిడి పంటలను రైతులు పండిస్తున్నారని, వీటి ఆధారితంగా పరిశ్రమలు వస్తే ఇటు రైతులు బాగుపడతారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో చాలా మంది వెళితే కువైత్‌కు లేదంటే కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, రాయలసీమను అభివృద్ధి చేయాలంటే పరిశ్రమలు రావాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం వచ్చే మార్గాలను చంద్రబాబు చూస్తున్నారని, 20 లక్షల ఉద్యోగాలను ఈ ప్రభుత్వంలో వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

హక్కుల కోసం నిరంతర పోరాటం

ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్



కోర్టు వద్ద న్యాయవాదులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, దేశంలో అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా సోమవారం ఆయన అన్నమయ్య, కడప జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి పట్టణం లక్ష్మీపురంలోని కోర్టు వద్ద న్యాయవాదులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ఐఏఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తోందని, న్యాయవాదులు తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చి బార్ కౌన్సిల్ సభ్యుడిగా మళ్లీ తనను గెలిపిస్తే న్యాయవాదుల హక్కుల కోసం మరింతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, రామకొండయ్య, రాయచోటి బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డిబాషా, ఉపాధ్యక్షుడు ధనుంజయ్‌కుమార్, ట్రెజరర్ ఆది రెడ్డినాయక్, రాయచోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆటో, కారు ఢీ - రైతు మృతి



పెద్దరెడ్డెయ్య మృతదేహం

రామాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి బస్టాప్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొని కోటకొండ పెద్దరెడ్డెయ్య (57) అనే రైతు మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెకు చెందిన రైతు కోటకొండ పెద్దరెడ్డెయ్య, కొందరు రైతులు రాయచోటి మార్కెట్‌కు కూరగాయలను ఆటోలో సోమవారం తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలోని బండపల్లి బస్టాప్ సమీపానికి వెళ్లగానే వెనుక వైపున శ్రీశైలం నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో కోటకొండ పెద్దరెడ్డెయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఢీకొన్న కారులో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడిని శవపరీక్ష నిమిత్తం బంధువులకు అప్పగించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

భార్య వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మల్లికార్జున

నిమ్మనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులు తాళలేక ఓ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లికు చెందిన మల్లికార్జునను అతడి భార్య మంజుల ప్రతిరోజూ వేధింపులకు గురిచేసేది. ఇటీవల మంజుల పుట్టింటికి వెళ్లి రామసముద్రం పోలీసుస్టేషన్‌లో తన భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు పెట్టినట్లు తెలిపారు. అంతటితో ఆగకుండా నాలుగురోజుల తర్వాత పుట్టింటి నుంచి వచ్చిన మంజుల భర్తను ఇంటిలోకి రానివ్వలేదని తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన మల్లికార్జున ఇంటిలో ఉన్న విషద్రావణం తాగగా గమనించిన కుటుంబీకులు వెంటనే మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని శవం లభ్యం

సిద్దవటం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగంపల్లె గ్రామ సమీపం పెన్నానదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. షర్టు తెలుపురంగుపైన ఆకుపచ్చ, నశ్యం కలర్ రంగు, నిలువు గీతలు కలిగి వయస్సు సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. ఆ వ్యక్తి చనిపోయి సుమారు 10-15 రోజులు అయి ఉంటుందని, జిల్లా పోలీసుస్టేషన్‌లో ఏదైనా మిస్సింగ్ కేసులు నమోదై వుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ 9121100584, సీఐ 9121100581 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పాఠశాలకు రూ.2 లక్షల ఆర్థికసాయం



భూమి పూజలో బ్యాంకు మేనేజర్, తదితరులు

రాజంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తాళ్లపాక గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల బాత్‌రూం నిర్మాణానికి కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో రూ.2 లక్షలు ఆర్థిక సహకారం అందించారు.

ఈ సందర్భంగా సోమవారం బ్యాంకు మేనేజర్ ఆకుల సుబ్బరాయుడు, బీజేపీ నాయకుడు తోట శ్రీనివాస్‌ధీరజ్, బిల్డర్ నాగేశ్వరరాజులు పాఠశాలలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాక పాఠశాలకు రూ.2 లక్షలు సహకారం అందించిన కెనరా బ్యాంకు ఏజీఎం అరుణజ్యోతికి ఉపాధ్యాయులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు

బాలికల విభాగంలో కడప, బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్లు విజయం



ప్రథమ స్థానంలో నిలిచిన కడప బాలికల జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం బాలుర జట్టు

రైల్వేకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-19 విభాగంలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి చంద్ర మోహన్‌రాజు మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో శ్రీకాకుళం మొదటి స్థానంలో, రెండో స్థానంలో కర్నూలు జట్టు నిలవగా, బాలికల విభాగంలో కడప జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో గుంటూరు జట్టు నిలిచిందన్నారు. రైల్వేకోడూరులో బేస్‌బాల్ పోటీలను అందరి సహకారంతో సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. పోటీల్లో ఎక్కడా అవకతవకలు జరగకుండా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆడారని తెలిపారు. భోజన, వసతుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశామని తెలిపారు. శ్రీకాకుళం-కర్నూలు, కడప-గుంటూరు జట్ల మధ్య ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో రైల్వేకోడూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోదర, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, ఏపీ బేస్‌బాల్ టోర్నమెంట్ పరిశీలకుడు దాదాపీర్, విశ్రాంత వ్యాయామ సంచాలకులు సుబ్బరాజు, చమర్తి శారద, విజయప్రసాద్ రెడ్డి, కడప జిల్లా జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉమ్మడి జిల్లాలకు చెందిన కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు మేరకు ఆక్రమణలు తొలగిస్తాం

● సబ్ కలెక్టర్ భావన



సబ్‌కలెక్టర్ భావనతో మాట్లాడుతున్న కృష్ణానగర్ వాసులు

రాజంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు మేరకు కృష్ణానగర్‌లో ఆక్రమణలు తొలగిస్తామని సబ్ కలెక్టర్ భావన తెలిపారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికలో కృష్ణానగర్ వాసులు సబ్‌కలెక్టర్‌ను కలిసి హైకోర్టు తీర్పును అందజేశారు.

వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ కూచివారిపల్లె గ్రామ పంచాయతీ రాజంపేట తహసీల్దారు, డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్, సర్వేయర్లకు నిబంధనల మేరకు రహదారిని చూపి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాజంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి కమలాదేవికి కూడా హైకోర్టు తీర్పు కాపీని అందజేశారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగిస్తామని హైకోర్టు తీర్పును అమలు చేస్తామని పంచాయతీ కార్యదర్శి కృష్ణానగర్ ప్రజలకు హామీ ఇచ్చారు.

సీటీఎం క్రాస్‌లో మహిళ దారుణ హత్య

● మెడకు టవల్ బిగించి చంపిన దుండగులు



హత్యకు గురైన మహిళ



సావిత్రమ్మ (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ పంచాయతీలో మహిళ దారుణ హత్యకు గురైంది. తాలుకా సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సీటీఎం క్రాస్ పాకాలవీధిలో నివాసం ఉంటున్న అర్జునరావు భార్య సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ (45) ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో బహిర్భూమికని వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం ఉదయాన్నే సచివాలయ సమీపంలో బీడు భూమిలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. ఆమె కూలి పనులు చేసుకొంటూ జీవిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మదనపల్లె డీఎస్పీ మహేంద్రకు విషయాన్ని తెలిపారు. వెంటనే డీఎస్పీ సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హత్యగా నిర్ధారించారు. సావిత్రమ్మ గొంతుకు టవల్ చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారన్నారు. సంఘటన స్థలంలో పోలీసులు, క్లూ టీం జాగిలాలతో పరీక్షించారు. అవి సంఘటన స్థలం నుంచి పాకాలవీధి వరకు వెళ్లి అగిపోయాయని తెలిపారు. వెంటనే మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ఆమెకు కుమార్తె కవిత, కుమారుడు ఆదిత్య ఉన్నట్లు చెప్పారు. హత్య జరిగినప్పటి నుంచి సావిత్రమ్మ కుమారుడు, కుటుంబసభ్యులు ఇంటికి తాళంవేసి ఎక్కడికో వెళ్లడంతో స్థానికులు వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తమ్ముడు సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ హత్య కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లెక్కల్లో లేని ఎరువుల విక్రయాలు నిలిపివేత



ఎరువుల రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీలత

కలికిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన రికార్డులు లేకుండా నిల్వ ఉంచిన ఎరువులను విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిలుపుదల చేశారు. రాయచోటి రెగ్యులర్ ఏడీఏ కె.శ్రీలత ఆధ్వర్యంలో స్థానిక ఎరువుల దుకాణాలలో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

తనిఖీల్లో భాగంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, గోడౌన్‌లలోని నిల్వలను బేరీజు వేశారు. ఫారం 'ఓ'లో నమోదు చేయకుండా అమ్మకాలకు పెట్టిన రూ.58,780 విలువైన నిల్వలను విక్రయించకుండా నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో ఈ నిల్వలను 'ఓ' ఫారంలో నమోదు చేయకుంటే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల ఏవో ఎం.హేమలత, ఏఈవో ఇంద్ర పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల బెడద

పోలీసులకు చింతపర్తి బీసీ కాలనీ వాసుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బీసీ కాలనీ వాసులు

వాల్మీకిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామం బీసీ కాలనీలో పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి వరుసగా ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడిన సంఘటన మరువకముందే మళ్లీ అదే బీసీ కాలనీ ప్రాంతంలో అర్ధరాత్రి దొంగల బెడద స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. సోమవారం సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో బీసీ కాలనీ, చింతపర్తి గ్రామానికి చెందిన మహిళలు వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఐదురోజుల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట సమయాన గుర్తుతెలియని వ్యక్తులు కాలనీ ప్రాంతంలో సంచరిస్తున్నారని, తలుపులు కొడుతూ బెదిరిస్తున్నారని, బిగ్గరగా కేకలు పెట్టేలోపు ఉడాయిస్తున్నారని వాపోయారు.

రాత్రి సమయాలలో ఇళ్లలో ఉండాలన్నా నిద్రపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నల్ల దుస్తులు ధరించి పాదరక్షలు లేకుండా చడీచప్పుడు కాకుండా బీసీ కాలనీ ప్రాంతంలో దుండగులు తిరుగుతున్నారని వివరించారు. దీనిపై ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇకపై రాత్రి గస్తీలు కూడా ముమ్మరం చేస్తామని కాలనీ వాసులు అధైర్య పడొద్దన్నారు. కాలనీ ప్రాంతంలో ఇంటి యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. అలాగే ఏ సమయంలోనైనా మళ్లీ గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే తక్షణమే సమాచారం అందిస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

అంగరంగ వైభవంగా లక్ష దీపోత్సవం



శివపార్వతుల కల్యాణం

కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



బి.కొత్తకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా బి.కొత్తకోటలో లక్ష దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణానికి చెందిన శ్రీమహావిష్ణుసేన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను వేదికపై ఆశీనులను చేసి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణవేడుకను నిర్వహించారు. వేదాంతగీత శివం ఫౌండేషన్ అధ్యక్షుడు పరమహంస పరివ్రాజకాచార్యులు పూజ్యపాద ఆచార్య అభినవశంకరానందస్వామి హైందవధర్మంపై చేసిన ప్రవచనాలు భక్తులను ఆలోచింపజేశాయి. అనంతరం అఖండజ్యోతిని వెలిగించి లక్షదీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. బి.కొత్తకోట పట్టణంలోంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చి దీపోత్సవం పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పీటీఎం రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్ నుంచి జ్యోతిసర్కిల్ వరకు టేబుళ్లపై అమర్చిన లక్షదీపాలు వెలిగించిన అనంతరం దీపాల వెలుగును చూసి జనం పరవశించారు. ఈ సందర్భంగా కేరళవాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

వెదురు సాగు... ప్రోత్సాహకాలు బాగు



పోరుమామిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ బ్యాంబు మిషన్ పథకం ద్వారా వెదురు సాగు ప్రోత్సహిస్తున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోరుమామిళ్ల ఉద్యానశాఖ డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో వెదురు నరకడానికి అటవీశాఖ అనుమతి తప్పక తీసుకోవాల్సి ఉండేదని, అయితే 2017లో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సడలించడంతో రైతులు తమ వ్యవసాయ భూముల్లో వెదురు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా...

వెదురు సాగు... ప్రయోజనాలు

వెదురు నాటిన నాలుగు సంవత్సరాల నుంచి కోతకు వస్తుందని, వెదురు సాగుతో ఎకరాకు సంవత్సరానికి రూ.2లక్షల నుంచి 3 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. బంజరు భూముల నుంచి సాగుకు అనుకూలమైన అన్ని నెలల్లో ఇది సాగు చేసుకోవచ్చు. అంతకాకుండా తక్కువ నీటి లభ్యత ఉన్న నేలలో సాగు చేసేందుకు అనువైన పంట అని, పొలం గట్లపైన సరిహద్దు పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. నేలకోతను అరికట్టడంలో సహాయపడుతుంది.

వాణిజ్య సరళిలో రకాలు...

సాగు సౌలభ్యం, వాతావరణ అనుకూలత, మార్కెట్ డిమాండ్‌ను బట్టి వాణిజ్య పరమైన సాగుకు మల్కోవా డెండ్ర కళామస్, అప్పర, బాంబుసా, బీమావంటి రకాలు అనుకూలంగా ఉంటాయి. ఇవి త్వరగా పెరగడంతో పాటు నాణ్యమైన కలప అందుతుంది. నేలను బాగా దున్ని మొక్కల మధ్యలో 5 ఇంటు 5 మీటర్లు దూరం ఉండేలా చూసుకుని గుంతలు తవ్వాలి. తేమతో కూడిన నేల అనుకూలం. బిందు సేద్యం పద్ధతిని పాటిస్తే మంచిది. నాటిన 3,4 సంవత్సరాల్లోనే పంట కోతకు వస్తుంది. సుమారు 40 సంవత్సరాల పైబడి దిగుబడి ఇస్తుంది.

ప్రభుత్వ మద్దతు... రాయితీ వివరాలు



వెదురు మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి

నేషనల్ బాంబుమిషన్ కింద మొక్కలు నాటడానికి నర్సరీల ఏర్పాటుకు.. రైతు శిక్షణ కేంద్రాల్లో రైతులకు సాగు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహణకు, విజ్ఞాన యాత్రలకు ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. రైతులు వెదురును పొలం నాటుకోవడానికి హెక్టారుకు 2 దఫాలుగా 60వేలు రాయితీ అందిస్తుంది. పొలంలో సరిహద్దు పంటగా నాటినా ఈ రాయితీ పొందవవచ్చు. ఒక రైతుకు దాదాపు పదిహెక్టార్ల వరకు రాయితీ ఉంటుంది. వెదురు వివిధ పంటల్లో ఊత కర్రగా, ఫర్నీచర్, నిర్మాణ పనులు, చేతివృత్తులు, కాగితం తయారీ వంటి వివిధ పరిశ్రమల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. పూర్తి వివరాలకు 79950 86977 సంప్రదించాలన్నారు.

రూ.14.10 కోట్లతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నుంచి రూ.14.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్థానిక వైద్యాధికారులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆస్పత్రి విస్తరణ, పాత మరుగుదొడ్ల పునర్నిర్మాణం, రోగుల సౌకర్యాల మెరుగుదల, పరిశోధన విభాగాల ఏర్పాటు చేయనున్నామన్నారు. జిల్లా ఆస్పత్రిలో వేధిస్తున్న సిబ్బంది కొరతను అధిగమించేందుకు పూర్తిస్థాయిలో నియామకాలు చేపడతామన్నారు. అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందన్నారు. అనంతరం దాతల సహకారంతో సేకరించిన వీల్‌చైర్స్, స్ట్రెచర్లు, బెడ్‌షీట్స్‌ను ఆస్పత్రి వర్గాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమశ్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, ఆర్ఎంవో డాక్టర్ శివరాం, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలి శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పద్మజ, రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్‌హుస్సేన్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్‌ముక్తియార్, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రమణ

పులివెందుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రమణ తెలిపారు. సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లింగాల మండలానికి చెందిన ఓ బాలిక పులివెందులలో చదువుతుండేది. పులివెందులలోని బాకరాపురం వీధిలో నివాసముండే షేక్ ఇమ్రాన్ ఆ బాలికను ప్రేమించమని వెంటపడేవాడు. ఇందుకు బాలిక తిరస్కరించి, తన తండ్రికి చెప్పింది. దీంతో ఆ యువకుడిని బాలిక తండ్రి గట్టిగా మందలించాడు. ఇది మనుసులో పెట్టుకున్న ఇమ్రాన్ నవంబరు 7వ తేదీ ఇంట్లో ఉన్న బాలికను కిడ్నాప్ చేసి కారులో అనంతపురం తీసుకెళ్లాడు. అక్కడ ఊరి బయట ఉన్న జగనన్నకాలనీలోని ఓ రూములో ఉంచి శారీరకంగా అనుభవించాడు. ఈనెల 14వ తేదీ ఆ బాలిక ఇమ్రాన్ నుంచి తప్పించుకొని వచ్చి లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ పులి వెందుల-పార్నపల్లె మెయిన్‌రోడ్డు తాతిరెడ్డిపల్లె క్రాస్ వద్ద అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు.

జనవరిలో కడపలో ఇస్తేమా : మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎండీ ఫరూక్

కడప కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే ఏడాది జనవరి 23 నుంచి 25 వరకు రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమం నిర్వహించనున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి సమాజ్ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్, జేసీ అదితిసింగ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, కడప ఎమ్మెల్యే మాదవిరెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇస్తేమా కార్యక్రమాన్ని ఈ సారి కడప జిల్లాలో నిర్వహిస్తామన్నారు. జనవరి నెలలో మూడు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కమిటీ సభ్యులు, అధికారులు విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించాలన్నారు. రోడ్ మ్యాప్, తాగు నీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ, బారికేడ్లు తదితర అంశాలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ఇస్తేమా కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జన వరిలో 3 రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఇస్తేమా కార్య క్రమానికి పక్కా ప్రణాళికతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్ప టికే వివిధ శాఖల అధికారులకు మౌలిక వసతుల కల్పనలు వివిధ రకాల విధులు నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇస్తేమా కార్యక్రమాన్ని కొప్పర్తిలోని ఏపీఐఐసీ ప్రాంతాన్ని గుర్తించామన్నారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పా టు దేశ వ్యాప్తంగా మైనార్టీ ముస్లిం పెద్దలు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

దత్తత పోస్టరు ఆవిష్కరణ



పోస్టరును ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దత్తత కార్యక్రమం పోస్టరును సోమవారం జేసీ అతిధిసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అనాధలు, అభాగ్యులైన పిల్లలను దత్తత ద్వారా పిల్లలు లేని వారు పొందవచ్చని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమాదేవితో పాటు ఆశాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో పలుచోట్ల చోరీలు



చోరీ జరిగిన రెడీమేడ్ షోరూంను పరిశీలిస్తున్న డీఎస్పీ

వేంపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని కందుల కాంప్లెక్స్‌లో ఉన్న తేజ రెడీమేడ్‌షోరూంలో చోరీ జరిగింది. తాళం పగులగొట్టి దుకాణంలోకి వెళ్లిన దొంగలు రూ.6వేల నగదు, పట్టుచీరలు తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అలాగే జడ్పీ కాంప్లెక్స్‌లో ఉన్న లక్కీ హెయిర్ సెలూన్‌లో ఉన్న డిజిటల్ టీవీని దొంగతనం చేశారు. చోరీ జరిగిన ప్రాంతాలను పులివెందుల డీఎస్పీ మురళినాయక్, సీఐ నరసింహులు, పోలీసు సిబ్బంది పరిశీలించి చుట్టుపక్కలవారిని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం





గ్రామోత్సవానికి బయల్దేరిన అయ్యప్పస్వామి, దీపాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఖాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి 9వ గ్రామోత్సవం కార్తీక 4వ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అయ్యప్పస్వామికి మహిళలు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ భక్తుల సహకారంతో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 12 గంటల వరకు కోలాటాల మధ్య భారీగా బాణసంచా పేల్చుతూ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కన్యస్వాములు కలశాలతో, మహిళలు దీపాలతో స్వామివారికి స్వాగతం పలికారు. ఈసంద ర్భంగా మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించిన లడ్డూను బీసీ కాలనీకి చెందిన రవికుమార్ (చిన్న) రూ.59 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



కొండాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సుగు మంచి పల్లెలోని కాశిలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సూర్యకిరణాలు శివలింగాన్ని తాకాయి. ఉదయం 6.30 నుంచి 7.00 గంటల వరకు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకినట్లు గ్రామస్తులు తెలిపారు. పవిత్ర కార్తీక సోమవారం నాడు సూర్యకిరణాలు పరమశివుని తాక డంతో భక్తులు పులకించిపోయారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, ఈ దృశ్యాన్ని తిలకించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జయమ్మ కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం



వెంకట్రామయ్యకు చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటూరు గ్రామ పంచాయతీ భాకరాపురం గ్రామానికి చెందిన అంబవత్తుల జయమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జయమ్మ మరణించగా, ఆమెకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో అదే గ్రామానికి చెందిన మండల టీడీపీ యువత అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో మంచి జరిగిందని తెలిపారు. ఆమె భర్త వెంకట రాయయ్య పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయ నకు ప్రతి నెలా రూ.15వేలు పింఛను అందే విధంగా ఎమ్మెల్యే మంజూరు చేయించారని తెలిపారు. లేబాక నాగేశ్వరరెడ్డి, నాగసు బ్బారెడ్డి కలిసి జయమ్మ కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందజేశారు.

వైవీయూ బయోకెమిస్ట్రి స్కాలర్ నవీన్‌కు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగివే మన విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ స్కాలర్ పి.నవీన్‌కు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. పి.నవీన్ ఆశాఖ ఆచార్యులు పి.రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో ప్రినేటల్ ఎక్స్‌పోజర్ ఆఫ్ జస్టోరెటిక్ ఆన్ మేల్ అండ్ ఫిమేల్ రెప్రొడెక్టివ్ హెల్త్ ఇన్ విస్టర్ ర్యాట్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు.
వైస్ చాన్సలర్ మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు అలానే వైవావోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా నవీన్ థీసిస్ డాక్టరేట్‌నకు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేర కు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెస ర్ కెఎస్‌వీ కృష్ణారావు స్కాలర్ పి.నవీన్‌కు పీహెచ్‌డీ నోటి ఫికేషన్‌ను ప్రకటించారు. నవీన్ రాసిన పరిశోధన పత్రాలు పలలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందు కున్న సందర్భంగా నవీన్‌ను పలువురు అభినందించారు.

పంటలను కప్పేసిన గడ్డి



వర్షాలకు మినుము పంటపై అల్లుకుపోయిన గడ్డి

రాజుపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నెలరోజులకు పైగా ఎడ తెరిపి లేకుండా వర్షాలు పడడంతో లోతట్టుగా ఉన్న భూముల్లో సాగైన మినుము, మిరప, జొన్న పంటల్లో విపరీతంగా గడ్డి మొలిచింది. దీనికితోడు పంటలన్నీ ఎర్రగా పోతుండడంతో రైతులు గత్యంతరం లేక గడ్డిమందు పిచికారి చేస్తున్నారు. రెండో పంట సాగుకు అయినా అనుకూలంగా ఉంటుందని వేలాది రూపాయలు ఖర్చు గడ్డిమందు కొట్టి పంటను చంపేస్తున్నారు. దీంతో సాగు చేసిన పంట నష్టాలతో పాటు రెండో పంట సాగుకు మరింత ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో దాదాపు రూ.2వేల నుంచి రూ.3వేల ఎకరాల్లో పంటలకు రైతులు చేసేది లేక గడ్డిమందు కొట్టి నాశనం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందిస్తే రెండో పంట సాగు చేస్తామని అంటున్నారు.

ఆస్తులు తీసుకుని తల్లిదండ్రులను వదిలేస్తే చర్యలు

- **జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదన్‌రావు**

కమలాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నుంచి ఆస్తులు తీసుకుని అనాథలుగా వదిలేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం కమలాపురం ఎమ్మార్వో ఆఫీసు ప్రాంగణంలో మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం-2007పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పెద్దల్ని గౌరవించే లా ఉండేదని, కాలక్రమేణా కుటుంబాలు విడిపోతుండడంతో కొన్ని కుటుం బాల్లో పెద్దలు నిర్లక్ష్యానికి గురవుతున్న పరిస్థితులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ప్రభుత్వం పెద్దలను రక్షించేందుకు ప్రత్యే కంగా 2007 చట్టాన్ని ప్రవేశపెట్టింద న్నారు. పిల్లలు ఆస్తి తీసుకున్న తరు వాత తల్లిదండ్రులను చూసుకోకపోతే ఆ ఆస్తి బదిలీని కోర్టు మోసపూరితంగా పరిగణిస్తుందని, తల్లిదండ్రులు కేసు వేసి ఆ ఆస్తిని తిరిగి పొందే పూర్తి హక్కు కలిగి ఉంటారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి బి.ఉదయ్‌కిరణ్, న్యాయవాదులు న్యాయవాది మహేశ్వర్‌రెడ్డి, వెంకటశివ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


పాలతల మల్లేశ్వరుడు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు కిక్కిరిశాయి. చెన్నూరు మల్లేశ్వరాలయంలో ఉదయం 10గంట నుంచి మధ్యాహ్నం 12.30గంటలకు మల్లేశ్వరుడి దాక్షాయణీ కల్యాణం రమణీయంగా జరిగింది. మధ్యాహ్నం స్థానిక దాత గలిజర్ల సాంబరాజు, లక్ష్మీదేవి కుటుంబీకుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. కాగా సాయంత్రం శివపార్వతుల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కోలాటం నిర్వహించారు.

నాగేశ్వరాలయంలో విశేష పూజలు..: చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో కొలువై ఉన్న మూలవిరాట్ నాగేశ్వరుడు, అమ్మవారు లలితాంబదేవికి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు.

వల్లూరు..: కార్తీక చివరి సోమవారం పురస్కరించుకుని పుష్పగిరిలో కామాక్షి సమేత వైద్యనాథేశ్వరున్ని రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ సంతాన మల్లేశ్వరుని దర్శించుకున్నారు. వల్లూరులోని భవానీశంకర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీ అమ్మవారిని గాజుల అలంకారం గావించారు.

వేంపల్లె..: కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన దుర్గాదేవి గవిమల్లేశ్వరుడిని పెద్దఎత్తున దర్శించుకున్నారు. విభూది అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీదేవి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే పాతపేటలోని భవాణి నీలకంఠేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు.

సింహాద్రిపురం..: మండలంలోని అన్ని శైవ క్షేత్రాల్లో ఉదయం నుంచి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గురిజాల సమీపాన గల గురుకుంట తిరుణాలకు భక్తులు బారీగా తరలి వచ్చారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భానుకోట శైవక్షేత్రానికి భక్తులు తెల్లవారు ఝాము నుంచి తరలి వచ్చారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెండ్లిమర్రి..: కార్తీక సోమవారం సందర్భంగా పొలతలలో భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి,అమ్మవార్లతో పాటు, అక్కదేవతలను దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం దేవస్థానం చుట్టూ స్వామి,అమ్మవార్ల ను ఊరేగింపు నిర్వహించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ కృష్ణానాయక్,చైర్మన్ శిరిగిరెడ్డి రాజారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కమలాపురం రూరల్..: కార్తీక సోమవారం సందర్భంగా మండల పరిధిలోని చదిపిరాళ్ల అగస్తేశ్వర స్వామి ఆలయం,ఎర్రగుడిపాడు పెద్ద చెప్పలి శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. చదిపిరాళ్లలోని అగసస్తేశ్వర్యస్వామి ఆలయంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీకేదిన్నె..: మండలంలోని బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయం, విశ్వనాథపురం శివాలయం, ఊటుకూరు శివాలయం, గంగమ్మతోపు శివాలయం, తదితర ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి ఘనంగా పూజలు నిర్వహించారు. గంగమ్మతోపు శివాలయం వద్ద అక్కదేవతల గుడి వద్ద శివపార్వతుల కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వీరపునాయునిపల్లె..: మండల పరిధిలోని అనిమెల గ్రామ సమీపంలోని సంగమేశ్వరాలయంలో సంగమేశ్వర పార్వతీదేవి ఉత్సవమూర్తులకు కనుల పండువగా కల్యాణం జరిగింది. కళ్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు.

అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.



చెన్నూరులో శివపార్వతుల కళ్యాణం, సింహాద్రిపురం... గురుకుంటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బంది పడ్డ భక్తులు

కాశీవిశ్వేశ్వరాలయానికి వెళ్లేందుకు 2గంటల పాటు నరకయాతన

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా శివాలపల్లెలో కొలువైన కాశీవిశ్వేశ్వరాలయానికి వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు గుడి వద్ద నుంచి శివాలపల్లె సమీపంలోని బ్రిడ్జి వరకు ట్రాఫిక్ జామ్ అయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 2గంటల పాటు వాహనాలు ఎటూ కదల్లేక ఇరుక్కుపోవడంతో ప్రజలు తీవ్ర నరకయాతన పడ్డారు. ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడినప్పుడు కనీసం పోలీసులు అక్కడకు వచ్చి కన్నెత్తి చూడకపోవడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




పొలతల స్వామివారి ఊరేగింపు, వీఎన్‌పల్లె...రథోత్సవంలో ఉత్సవమూర్తులు, చెన్నూరు మల్లేశ్వరాలయం వద్ద అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

రేపు ఉచిత కంటి పరీక్ష శిబిరం

లింగాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామసముద్రంలో బుధవారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటుచేస్తున్నామని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. పులివెందుల రాజారెడ్డి ఆసుపత్రి వారి సహకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య విజ్ఞాన సంస్థ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచితంగా మందులు, అవసరం అయిన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

21న విద్యుత్ అదాలత్

పులివెందుల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ శుక్రవారం పులివెందులలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తుననట్లు పులివెందుల విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ జి.ప్రసాదరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందుల డివిజన్ పరిధిలోని పులివెందుల, తొండూరు, సింహాద్రిపురం, లింగాల, వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సమస్యలుంటే రాతపూర్వకంగా అర్జీ సమర్పించి వెంటనే పరిష్కారం పొందా లని కోరారు. పులివెందుల విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామన్నారు.

పాడి పశువులపై శ్రద్ధ తీసుకోవాలి

సీకేదిన్నె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాడిపశువులపై రైతులు శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని పెద్దకాంపల్లి, కొలుములపల్లె, నాగిరెడ్డిపల్లె పశువైద్యశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో పశువులకు వచ్చే వ్యాధుల గురించి రైతులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా చలికాలంలో పాడిపశువులకు ఆరుబయట పెట్టకుండా పశువుల పాకలో కానీ, షెడ్లలో కానీ పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పశువైద్య అధికారి శివరామిరెడ్డి, చంద్రకిశోర్, రఫి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల మృతి దురదృష్టకరం

కమలాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో దైవ దర్శనానికి వెళ్లిన తెలంగాణకు చెందిన మైనార్టీలు 42 మంది ప్రమాదవశాత్తు బస్సు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ పేర్కొన్నారు. కమలాపురంలో సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు.

కడప నాగరాజుపేట..: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన మక్కా యాత్రికులు మృతిచెందడం పట్ల ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.గౌస్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

కడప మారుతీనగర్..: మక్కా యాత్రలో హైదరాబాద్‌కు చెందిన 45 మంది మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ నాయకులు ఖాదర్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం కడపలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మైనార్టీ నాయకులు ఆసిఫ్‌ఖాన్, అశోక్, సయ్యద్ అలీ పాల్గొన్నారు.

'ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్ భారంగా మారుతోంది'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ పరీక్షల నేపథ్యంలో రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ఉపాధ్యాయులు, విద్యార్థులకు భారంగా మారుతోందని ఎస్టీయూ రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. సోమవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే తరగతిపై మాత్రమే వంద రోజుల దృష్టిపెట్టడం వల్ల ఇతర తరగతులు నిర్లక్ష్యం అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.







ఎల్ఐసీ మొబైల్ వాహనాలతో ప్రచారం ప్రారంభం

కడప నాగరాజుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఆరు లక్షల పాలసీలు ఒకేరోజు సేకరించి 2025 జనవరి 20న ఒక్కరోజులో అత్యధిక పాలసీలు సేకరించిన బీమా సంస్థగా ఎల్ఐసీ గిన్నిస్ రికార్డు సాధించిందని ఎల్ఐసీ కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి.రవికుమార్ అన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో మొబైల్ వెహికల్ ప్రచారాన్ని జెండా ఊపి ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ రామకృష్ణ, ఇతర మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును మార్చాలి

వేంపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డును దూరప్రాంతానికి మార్చాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లాఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. వేంపల్లె పంచాయతీ కార్యాలయం ఎదుట ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న డంపింగ్ యార్డును గతంలో మార్చాలని అధికారులు నిర్ణయించి మళ్లీ వాయిదా వేయడం తగదన్నారు. అనంతరం ఈఓ నాగభూషణంరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, ఉత్తన్న, బండారు వెంకటేశ్, వేమయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్సీ




వేముల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారేపల్లె గ్రామంలో మోపూరి భైరవేశ్వరస్వామి దేవస్థానం పరిసరాల్లో ఎద్దుల బండలాగుడు పోటీలను ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్తీక సోమవారం కావడంతో బండలాగుడు పోటీలను నిర్వహించారు.పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి హాజరయ్యారు.

ఈ-పంట నమోదు సామాజిక తనిఖీ

వేముల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేముల మండలంలో ఖరీఫ్ 2025లో 4352 మంది రైతులు 12352 ఎకరాలలో రైతులు సాగుచేయబడం జరిగిందని ఏవో జీపీ ఓబులేసు తెలిపారు. మండలంలోని వి.కొత్తపల్లె, వేముల రైతు సేవా కేంద్రాలలో ఆయన మాట్లాడుతూ ఈ-పంటనమోదు సామాజిక తనిఖీ చూసుకొని ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటినిపరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులలు పేర్ల శేషారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగాల..: ఖరీఫ్ 2025 ఈ -క్రాప్ నమోదు పూర్తిచేయడం జరిగిందని, ఆ జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాలలో సోషల్ ఆడిట్‌కోసం ప్రదర్శనకు అందుబాటులో ఉంచామని ఏవో రమేష్ తెలిపారు. లింగాల, బోనాల, వెలిదండ్ల రైతు సేవా కేంద్రాలలో సోమవారం ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శించామని రైతులు జాబితాను సరిచూసుకొని తప్పులేమైనా ఉంటే ఫిర్యాదు చేస్తే సరిచేసి తుది జాబితాను రూపొందిస్తామని తెలిపారు.

ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి - ఎమ్మెల్యే


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

సీకేదిన్నె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం వారి సమస్యలను అధికారులతో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, ఓబుళరెడ్డి, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో కుళాయిబాబు, పంచాయతీ కార్యదర్శి శాంతమ్మపాల్గొన్నారు.

నిరుద్యోగ దళిత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

కడప మారుతీనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ దళిత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగులు, బీసీ. యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎం. ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అవినీతిపై చర్యలు తీసుకోవాలి

కడప, కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో పేద ప్రజలకు వైద్యం ఖరీదుగా మారిందని, అక్కడ జరిగే అవినీతిపై చర్యలు తీసుకోవాలని పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాష, సయ్యద్ గౌస్ పీర్,జి సుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు.

కొక్కిరాయపల్లె అభివృద్ధికి కృషి చేస్తా : పుత్తా


భూమిపూజ చేస్తున్న పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొక్కిరాయపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. కొక్కిరాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించబోయే గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమవారం భూమిపూజ చేశారు. మాజీ ఎంపీటీసీ చింతకుంట వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి,కార్యదర్శి రేణుకాదేవి, ఇంజనీరు విష్ణు, మాజీ ఎంపీటీసీ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక విద్యాబోధనకు అంతరాయం ఏర్పడుతున్నదని తక్షణం ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షంషుద్దీన్‌కి వినతిపత్రం సమర్పించారు. డీఈఓను కలిసి వారిలో జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా మల్లాలమ్మ జయంత్యుత్సవం


మల్లాలమ్మ దేవి గ్రామోత్సవం

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొండపేట గ్రామంలో కొలువై ఉన్న మల్లాలమ్మ దేవి జయంత్యుత్సవాన్ని మహేంద్ర మేదర సంఘం ఆధ్వర్యంలో కనులపండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహంచారు. మంగళవాయిద్యాలు, బాణసంచాలతో గ్రామమంతా ఊరేగించగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట పింఛనర్ల నిరసన

పులివెందుల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసిన ఈపీఎస్-95 పింఛనర్లు ఎదుర్కొంటున్న కొన్ని వివాదాస్పద సమస్యలను పరిష్కరించాలని ఆల్ పింఛనర్స్‌రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సీఐటీయూ నాయకుడు గఫూర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ప్రభుత్వ రంగ సంస్థల్లోని పింఛనర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఏ లింకేజీతో కనీస పింఛన్ రూ.1000ను రూ.9000కు పెంచాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. వీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. అనంతరం ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ పింఛనర్స్‌రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఏపీఎస్ఆర్టీసీ పింఛనర్స్, ఎలక్ట్రికల్ పింఛనర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పింఛనర్లు



ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శివాయ.. నీలకంఠాయ...

● కార్తీక 4వ సోమవారం శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు ● శివుడికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు ● ఆలయాలకు దీప శోభ



జమ్మలమడుగు కన్నెతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు



పుష్పాలంకరణలో సైకత లింగం





మైదుకూరులోని మల్లేశ్వరుడి దర్శనానికి వెళుతున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాశివునికి ప్రీతికరమైన కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. వేకువజాము నుంచే ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు రుద్రాభిషేకాలు చేసి భక్తిశ్రద్ధలతో భక్తులు మొక్కులుతీర్చుకున్నారు. రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. హనుమత్‌లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా స్వామివారికి అభిషేకాలు చేశారు. శివాలయంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకత లింగానికి, నవరత్నలింగం, జలలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు చివరి సోమవారం కావడంతో ఉదయం, సాయంత్రం భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

కన్నెతీర్థంలో భక్తిశ్రద్ధలతో పూజలు

జమ్మలమడుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని కన్నెతీర్థంలోని త్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి సుందరేశ్వరస్వామి, త్రిపుర సుందరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కొండాపురంలో: కార్తీక నాల్గవ సోమవారం కావడంతో శైవక్షేత్రాల్లో వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని బాలప్పకోన ,మల్లేశ్వర కోన, దొంతికోన కు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన బాలప్పకోనలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు రామాంజులరెడ్డి, మిట్టాభాస్కర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ మిట్టాపుల్లారెడ్డి పాల్గొన్నారు

మైదుకూరు రూరల్‌లో :కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి.హర హర మహాదేవ శంభో శంకర.. అంటూ భక్తులు స్వామి దర్శనం చేస్తుకొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ముక్కొండ మల్లేశ్వరుడిని దర్శనం చేసుకొనేందుకు భక్తులు భారీగా విచ్చేశారు. వనిపెంట చెన్నకేశవ ఆలయం, మొండి భైరవకొన తదితర క్షేత్రాలకు భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

మైలవరంలో: చివరి కార్తీక సోమవారం కావడంతో మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామి కోన, త్రిమూర్తుల కోన, కల్లుట్ల రామలింగేశ్వరస్వామి కోన, తదితర శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి శివునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులుపెద్ద ఎత్తున తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. పలు శివాలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అగస్త్యేశ్వరస్వామి కోనలో, అలాగే నక్కోనిపల్లె సమీపంలోని శివాలయాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దువ్వూరులో: దువ్వూరులో సోమవారం శివాలయాలు భక్తుల సందర్శనతో కిటకిటలాడాయి. భీమలింగేశ్వరుని దర్శనార్థం అధిక సంఖ్యలో ఇక్కడకు వచ్చారు. దేవుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలతోపాటు అన్నదానం నిర్వహించారు.

ఐక్యతకు ప్రతీక ముస్లిం వితరణ

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పాత దువ్వూరులోని భీమలింగేశ్వర ఆలయానికి వచ్చిన భక్తులకు షబ్బీర్ అనే ముస్లిం అన్నప్రసాదాలు అందజేసి హిందూ ముస్లింల ఐక్యతను చాటుకున్నాడు. సుమారు 350 మంది భక్తులకు అన్నవితరణ చేయడంతో అందరూ అతని సేవలను అభినందించారు.

బి.కోడూరులో: మండలంలో కార్తీక చివరి సోమవారం ఉత్సవాలు ఘనంగా జరిగాయి, మున్నెల్లి గ్రామ సమీపంలో సగిలేటి వడ్డున వెలసిన పురాతన శివాలయంలో మేకవారిపల్లె సమీపంలో ఉన్న 108 శివలింగాల వద్ద కొండ మోటుపల్లెలో వెలసిన నరసయ్యస్వామి వద్ద మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు.

పోరుమామిళ్లలో: కార్తీక చివరి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. బలిజకోటవీధిలో అతి పురాతన శివాలయంలో తొలిసారిగా సర్పంచ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో రుద్ర హోమం నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే బ్రాహ్మణ వీధిలోని బాలా త్రిపురసుందరీదేవి రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.

ఎర్రగుంట్లలో: హరహర మహాదేవ అంటూ కార్తీకమాసం చివరి సోమవారం శివాలయాల్లో తెల్లవారుజామునుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐసీయల్‌లోని ఉమామహేశ్వరాలయంలో సాయంత్రం నందికి ప్రదోషపూజలు నిర్వహించగా భారీ ఎత్తున మహిళలు పాల్గొన్నారు. నడివూరులోని రామాలయంలో ప్రత్యేక దీపాలంకరణ అందరిని ఆకట్టుకుంది. మహాఅంకమ్మ ఆలయంలో శివునికి రుద్రాభిషేకం చేశారు. మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దనపాడులోని శివాలయంలో ప్రత్యేక అభి షేకాలు చేశారు.

ముద్దనూరులో: మండలంలోని అన్నిశివాలయాల్లో చివరి కార్తీక సోమవారం సందర్భంగా పెనికెలపాడు వామికొండ పై నున్న శివాలయంలో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.శివునికి ప్రత్యేక అలంకరణ చేశారు. భారీ ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ డీసీసీబీ చైర్మన్ కాటమయ్య భక్తులకు అన్నదానం చేశారు.



కొండాపురం బాలప్పకోనలో పూజలందుకుంటున్న పరమేశ్వరుడు



ఎర్రగుంట్ల మహా అంకమ్మ ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం



దువ్వూరులో భక్తులకు అన్నదానం చేస్తున్న ముస్లిం



బి.కోడూరులో పూజలందుకుంటున్న 108 శివలింగాలు

అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



బద్వేలుటౌన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం అయ్యప్ప స్వామి గ్రామో త్సవం వైభవంగా నిర్వ హించారు. అశేష జన వాహిని అయ్యప్ప స్వాముల స్వామియే శరణమయ్యప్ప శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పలువురు మహిళా భక్తులు దీపాలను చేతబట్టి వారివెంట నడిచారు.

సీఐగా హేమసుందరరావు

పోరుమామిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల సీఐగా హేమసుందరరావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా విధులునిర్వహిస్తున్న శ్రీనివాసులు రైల్వేకోడూరుకు బదిలీ కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న హేమసుందరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

కాశినాయన నవంబరు17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మైథిలీ పేర్కొన్నారు. సోమవారం నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18న గొంటువారిపల్లె, 19న వరికుంట్ల 20న ఇటుకులపాడు, 21న వంకమర్రి, 22న రెడ్డికొట్టాల, 24న కోడిగుడ్లపాడు, 25 నర్సాపురం మోడల్ పాఠశాల, 26న వరికుంట్ల కస్తూర్బా పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు.

కబ్జాదారుల నుంచి భూములను కాపాడాలి

బద్వేలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని సోమవారం సీపీఐఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆపార్టీ స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ కలసపాడు మండలం శంఖవరం గ్రామం, పోరుమామిళ్ల మండలం సమీపంలో సుమారు 50 ఎకరాలు పైగా చదును చేసుకుని ఆక్రమణదారులు ఆక్రమిస్తుంటే అధికారులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా అధికారులు ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. సీపీఐఎంఎల్ జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య, ఏరియా కమిటీ సభ్యులు బాబు, మహబూబ్‌బాష పాల్గొన్నారు.

వైభవంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం

అట్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండూరు గ్రామంలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక మాసంలోని నాలుగో సోమవారం కల్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భద్రకాళీ వీరభద్రస్వామి నూతన ఆలయం 8 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా కల్యాణం నిర్వహించగా చుట్టుపక్కల గ్రామాలు నుంచి భక్తులు పాల్గొని కల్యాణం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.

అర్కటవేములలో త్రిపురసుందరీ, సోమేశ్వర కల్యాణం



రాజుపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్కటవేముల గ్రామం లో కార్తీక చివరి సోమవారం సందర్భంగా పురాతన త్రిపుర సుందరీ సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలతో సాగిన ఈ కల్యాణం గ్రామంలోని మహిళలు పాల్గొని తిలకించారు. అనంతరం సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం చేశారు. వెల్లాలలోని భీమలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలునిర్వహించారు.

ఘనంగా మునెయ్యస్వామి తిరుణాల



పుష్పాలంకరణలో మునెయ్యస్వామి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని మునెయ్యస్వామి ఆలయంలో స్వామి తిరుణాళ్లను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం చివరి సోమవారం నాడు స్వామి తిరుణాళ్ల నిర్వహిస్తున్నారు. ఉదయం మునెయ్యస్వామికి విశేష పూజలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. కొందరు భక్తులు తలనీలాలను సమర్పించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం ఉదయం వరకు కొనసాగాయి. భక్తులు చౌడేశ్వరీదేవి జ్యోతిని తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేశారు. పట్టణంలోని అన్ని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తుల రాకతో ఆలయాలు సందడిగా మారాయి. కొన్ని ఆలయాల్లో అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

బాలల సంక్షేమానికి ఐసీడీఎస్ కృషి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, వారి రక్షణ, సంక్షేమానికి ఐసీడీఎస్ ఎంతగానో కృషి చేస్తున్నదని సీడీపీవో అరుణకుమారి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా స్థానిక సంజీవనగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలలకందే హక్కులు, విద్యాబోధనపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, విజయేశ్వరి, , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గైబూసాహెబ్, రాజమోహన్‌రెడ్డి, జయప్రతాప్ అంగన్వాడీ కార్యకర్త సావిత్రమ్మ ఉన్నారు.

బిల్లులు చెల్లించకుండా వేధింపులు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆగ్రో జీఎం ట్రాక్టర్ బకాయిలను చెల్లించకుండా వేధిస్తున్నారని ఎస్కార్ట్ ట్రాక్టర్స్ ఇన్స్టిట్యూషనల్ డీలర్ మణిభూషణ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారంవిలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. నెల రోజుల కింద గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు అయిదు ట్రాక్టర్లను సరఫరా చేశామని, అక్కడి మున్సిపల్ అధికారులు ఆ బిల్లులను ఏపీ ఆగ్రోకు చెల్లించారన్నారు. తమ వాహనాలకు సంబంధించిన బిల్లులను ఆగ్రో జీఎం రాజమోహన్ కక్షసాధింపు ధోరణిలో నిలిపివేశారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

బద్వేలు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బయనపల్లె చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు తెలిపారు. చెరవు నుంచి మట్టిని తవ్వి వెంచర్‌కు తరలిస్తున్నట్లుగా సమాచారం రావడంతో అధికారులను పంపి అడ్డుకుని ఆపై రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



లబ్ధిదారులకు ఇంటి ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంఎల్‌ఏ పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు నవంబరు17 (ఆంధ్రజ్యోతి) :ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైదుకూరు ఎంఎల్‌ఏ పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు.మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లిలో 41 మంది పేదలకు మంజూరైన ఇళ్ల ధృవీకరణపత్రాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా నల్లిపోగు లక్ష్మీదేవి అనే లబ్ధిదారు ఇంటికి భూమిపూజ కూడా చేశారు. పట్టణ ప్రాంతాలలో రూ.2,50,000లు ఇంటి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఇస్తుందన్నారు. మన మున్సిపాలిటీలో మొదటి విడతగా 222 ఇళ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజారత్నం, తహసీల్దారు రాజసింహనరేంద్ర, కమిషనర్ రంగస్వామి, రాష్ట్ర కనీస వేతనాల డైరెక్టర్ దాసరి బాబు, శంకర్‌రెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు పనితీరు మార్చుకోవాలి

ఖాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు పనితీరును మార్చుకోవాలని, మండల ప్రజలను తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటే చర్యలు తప్పవని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు లేవని, ఒక్క ఖాజీపేట రెవెన్యూ , అగ్రికల్చరల్ అధికారులపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారని, మీ పనితీరు మార్చుకోకపోతే ఏసీబీ అధికారులకు పట్టించాల్సి వస్తుందన్నారు. ప్రజలు బిల్డింగ్‌లు కట్టుకోవాలంటే వారికి అనుబంధ పత్రాలు వారం రోజుల్లోగా ఇవ్వాలని, లేకుంటే తహసీల్దారుకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి ఆ కాపీని నాకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. అధికారులు కుంటిసాకులు చెప్పి తప్పించుకోలేరన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, తహసీల్దారు రమణమ్మ, ఎంపీడీవో దివిజాసంపతి, పంచాయతీ సర్వేయర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషి వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖామంత్రి నారాలోకేశ్‌ల కృషి వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలే కరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌కు భయపడి రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలే బయటికి వెళ్లాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిపై కృషి జరుగుతోందన్నారు. నవంబరు 14, 15తేదీల్లో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నాయన్నారు. 613 పరిశ్రమలపై ఒప్పందాలలు జరిగాయన్నా రు. మంత్రి లోకేశ్ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర కోస్తా రాయలసీమ ప్రాం తాలలో సమానంగా అభివృద్ధిని సాధించడమే లక్ష్యమన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, టీడీపీ మండల అధ్యక్షుడు లాయర్ చంద్రా, జనసేన ప్రతినిధి జిలాన్, కౌన్సిలర్ వంగ నూరు మురళీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు లు పాల్గొన్నారు.

ఏపీలోకి పరుగులు పెడుతున్న పరిశ్రమలు

● నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ● టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ల కృషితో మన రాష్ట్రంలోకి పరిశ్రమలు పరుగులు పెడుతున్నాయని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సీఐఐ సమ్మిట్ అన్నారు. పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ ఎంతో వ్యూహాత్మకంగా శ్రమిస్తున్నారని ఆదిశగా భాగస్వామ్య సదస్సు సీఐఐ నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై గ్లోబల్ దృష్టిని మళ్లీ కేంద్రీకరించిందన్నారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా గైడ్ చేశారన్నారు. మొత్తం 613 ఒప్పందాల ద్వారా రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్రాభివృద్ధి పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల శ్రీనివాసులరెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, నాగలక్షుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూఖ్‌కు కలిసిన ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కడప ఆర్‌అండ్ బీ అతిథి గృహంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైదుకూరు నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి మంత్రి ఫరూఖ్‌తో ఎమ్మెల్యే పుట్టా చర్చించారు. ఎమ్మెల్యే తెలిపిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

జీఎస్‌టీ చెల్లింపులపై మున్సిపాలిటీలో ఆడిట్

ప్రొద్దుటూరు , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 2018 నుంచి ఇప్పటివరకు జీఎస్‌టీ చెల్లింపులపై జీఎస్‌టీ అధికారులు మున్సిపల్ రికార్డులతో సహా పరిశీలించి ఆడిట్ చేస్తున్నారు. సోమవారం జీఎస్‌టీ అధికారి జ్ఞానాందరెడ్డి ఆధ్వర్యంలో జీఎస్‌టీ అధికారులు సిబ్బంది మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డిని కలిసి రికార్డుల పరిశీలనకు అనుమతులు కోరారు. అంతేకాక ఇటీవల కాలంలో ఎగ్జిబిషన్ లీజు , మార్కెట్ లీజు, మున్సిపల్ అద్దెగదుల లీజు తదితరాల్లో జీఎస్‌టీ చెల్లింపులు ఏమేరకు జరిగాయి ఏమైనా చెల్లింపులు జరగలేదా అనే విషయాలపై మూడు రోజుల పాటు ఫైల్స్ పరిశీలించనున్నారు.

రాచమల్లుకు పైసలు ముట్టకపోతే దీక్షలు చేస్తాడు

● టీడీపీ నేత ప్రవీణ్‌కుమార్ రెడ్డి ధ్వజం



ప్రొద్దుటూరు , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచ మల్లు ప్రసాద్ రెడ్డికి పైసల పొట్లాలు ముట్టపోతే టెంట్లు వేసి దీక్షలు చేస్తాడని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లుకు చిత్తశుద్ధి ఉంటే మున్సిపాలిటీలో ఉన్న అన్నిరకాల బకాయిలు రాబట్టడానికి దీక్షలు చేసి వుంటే అతను ప్రొద్దుటూరు ప్రజల కోసం చేశాడని నమ్ముతామన్నారు. కేవలం ఈ ఏడాది ఎగ్జిబిషన్ నిర్వహణ దారుడు డబ్బులు కట్టడం లేదని చెప్పి 11 రోజులు గా టెంట్‌లువేసి దీక్షలు చేయడం వెనుక పెద్ద రాజకీయం ఉందన్నారు. డీఏడబ్ల్యూ కాలేజీ అక్రమాలను అడ్డుపె ట్టుకోని రూ. 2.5 కోట్లు దండుకున్నది వాస్తవం కాదని శివపార్వతుల మీద ప్రమాణం చేయగలవా? అని ప్రవీణ్ సవాల్ విసిరారు.

104 వాహన వైద్యసేవలు వినియోగించుకోండి

బద్వేలు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న చికిత్స 104 వాహన వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని తొట్టిగారిపల్లె వైద్యాధికారి నాగేశ్‌కుమార్ కోరారు. సోమవారం మండల పరిధిలోని అప్పరాజుపేట గ్రామంలో లెప్రసీ డిటక్షన్ శిబిరాలు, సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు మాట్లాడుతూ 104 చంద్రన్న చికిత్స వాహనంలో రక్తపోటు, షుగరు వ్యాధులకు వైద్య చికిత్సలతోపాటు 30 సంవత్సరాలు దాటినవారికి క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే మెరుగైన వైద్యం కోసం సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలోడిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటరు వెంకటయ్య, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసరు చంద్రావతి, సూపర్‌వైజర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.